# తికమక

– నోరి రాధిక

"ఇంకా నిద్ర పోతున్నారా? ఇవాళ రామబంటుగారింట్లో పూజ వుంది. త్వరగా వెళ్ళాలి. మర్చిపోయారా? లేవండి. లేవండి" అంటున్న మా ఆవిడ సుప్రభాతానికి మెలకువ వచ్చేసింది నాకు.

"అబ్బా! శనివారం కూడా హాయిగా నిద్ర పోకుండా ఏమిటి పొద్దున్నే ఈ పూజలు? నువ్వు వెళ్ళు. నేను ఆలస్యంగా తర్వాత వస్తాలే" అంటూ మళ్ళీ దుప్పటి మీదకు లాక్కున్నాను. భక్తి కొద్దీ వాళ్ళు పూజలు చేయటం కాదు కానీ ఈ పూజల పిచ్చి లేని నాలాంటి వాళ్ళకి మాత్రం చాలా ఇబ్బందిగా వుంది. అలా అని నేనేమీ నాస్తికుడిని కాదు. కానీ హద్దులు దాటి ఏది చేసినా, చివరికి పూజలయినా సరే, నాకు నచ్చదు. అందుకే **weekend** హాయిగా నిద్ర పోవటానికి మళ్ళీ వుపక్రమించాను. వారం అంతా కష్టపడి పని చేస్తాం. కనీసం **weekend** అన్నా కొంచెం ఆలస్యంగా నిద్ర లేచి, రిలాక్స్ అయి **enjoy** చేయకపోతే ఎలాగ? మళ్ళీ మంచి నిద్ర పట్టేసింది నాకు. నేను మళ్ళీ నిద్ర లేచేసరికి మంగళ వంటింట్లో ఇడ్లీ పచ్చడి చేస్తోంది. "లేచారా? ఇదిగో, ఇడ్లీ చేసాను. పచ్చడి కూడా చేస్తున్నాను. ఇవాల్టికి సాంబారు లేకుండా ఒక్క పచ్చడి తోనే సరిపెట్టుకోండి. నేను వెళ్తున్నాను" అంది గబగబా నన్ను చూస్తూనే. "వెళ్ళదవుగానిలేవోయ్. అంత తొందరెందుకు? రామబంటుగారి పూజ అంటే నీకు తెలుసుగా! పొద్దున్న మొదలయి తాపీగా సాయంత్రం అయితే కానీ తెమలదు కదా!" అంటున్న నన్ను మధ్యలోనే ఆపేసింది మంగళ. "అమెరికాలో వుంటున్నా గుడికి వెళ్ళకుండా ఇంట్లోనే శాస్త్రోక్తంగా పూజలు, పునస్కారాలు చూసే భాగ్యం మనలాంటివారందరికీ కలుగుతోంది రామబంటుగారిలాంటి వారి వలన. అందుకని ఆయనను ఏమీ అనకండి" నన్ను హెచ్చరిస్తున్నట్లు అంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది మంగళ. నేను స్నానం చేస్తున్నపుడు మంగళ బయలుదేరినట్లు గరాజు వేసిన శబ్దం అయింది. నేను పూజ, **breakfast** అన్నీ ముగించి మామూలుగా ప్రతీ **weekend routine** గా చేసే **long distance phone calls** అన్నీ ముగించి కాసేపు **internet** లో ఆవారం వారఫలాలు చూసి బయల్దేరాను. మా చిన్నబ్బాయి వారఫలాల్లో స్నేహితులతో జాగ్రత్తగా వుండమని వుంది. అసలే మొదటిసారి పరాయి వూరుకి చదువు కోసం వెళ్ళాడు. ఒంటరిగా వుంటున్నాడు. పసి పెధవ ఎలా వుంటున్నాడో, ఏమిటో అని నేను బెంగ పడుతూ వుంటే ఈ వారఫలమేమిటి ఇలా వుంది అని నేను కాస్త కలవరపడ్డాను. ఇంక బయల్దేరాలి, మరీ భోజనం వేళకి వెళ్తే రామబంటుగారి కంటే ముందు మంగళకే కోపం వస్తుంది, కనీసం మంగళహారతి సమయానికన్నా అందుకోవాలి అనుకుంటూ కారు **start** చేసాను.

రామబంటుగారు మావూళ్ళో యూనివర్సిటీలో **Religion** లో ప్రొఫెసరు. చాలా ఏళ్ళ క్రితమే అమెరికా వచ్చేసి ఇక్కడ శాశ్వతంగా స్థిరపడినా మన పూజలు, పునస్కారాలు అన్నవి ఏవీ మరిచిపోలేదు. అన్నీ చాలా శ్రద్ధగా, విపులంగా చేస్తారు. కాకపోతే చాలా చాదస్తంగా, ఒక పూజ లోంచి ఇంకో పూజలోకి వెళ్ళిపోతూ, గంటలపాటు ఇంక తుది అంటూ లేకుండా ఆ పూజలు చేస్తూ వుంటే, మారుతున్న రోజులకి తగ్గట్లు భక్తిని మలుచుకునే నాలాంటి **moderate** మనిషికి మాత్రం కాస్త విసుగనిపించటం మాత్రం నిజం. పెద్దాయన, శాస్త్రాలు తెలిసిన విద్వాంసుడు. పురాణాలు చదివి ప్రవచనాలు చెప్పగల పండితుడు. మడి దడి అంటూ చాలా కట్టుబాట్లతో వుండే నియమనిష్టాపరుడు. అందుకే అందరూ మనసులో ఏమనుకున్నా బయటికి మాత్రం ఏమీ అనటానికి సాహసించరు.

ఇవన్నీ ఆలోచించుకుంటూ నేను వారింటికి చేరేసరికి ఒంటిగంట దాటిపోయింది. దగ్గరగా వేసివున్న తలుపులను తోసుకుంటూ లోపలికి వెళ్ళాను. లోపల చాలామందే వున్నారు. విష్ణు సహస్రనామాలు చదువుతున్నారు. నలభై రోజులు సుందరకాండ పారాయణం చేసి హనుమజ్జయంతి రోజున వుద్వాసన చేస్తున్నారని మంగళ ముందే చెప్పింది. కానీ రామబంటుగారి సంగతి నాకు తెలుసుగా! సుందరకాండ అయిన తర్వాత హనుమాన్ చాలీసా అంటారు. అదయిన తర్వాత బహుశా విష్ణు సహస్రనామాలని అనివుంటారు. ఫరవాలేదు, మొత్తానికి మంగళ తిట్లు తప్పాయి అనుకుంటూ కూర్చున్నాను. విష్ణు సహస్రనామాలయిపోయాయి. అయ్యవారిని పూజించి అమ్మవారిని తలుచుకోనిదే అపచారమని లక్ష్మీ స్తోత్రం మొదలెట్టారు. భక్తి హద్దులు దాటి వేలంవెర్రిగా మారటం అంటే ఇదే కాబోలు. పిల్లలు ఆకలితో సన్నగా ఏడుపులు మొదలెడుతున్నారు. పెద్దవాళ్ళ ముఖాల్లో కూడా కొంచెంగా విసుగు కనిపిస్తోంది. ఇంక కొడుకు, కోడలు అంటూ ఆ విష్ణు కుటుంబం మొత్తం అందరినీ పూజించనిదే ఇవాళ ఎవరికీ తిండీతిప్పలు పెట్టరేమో అనుకుంటూ వుంటే ఎలాగైతేనేం మొత్తానికి పూజ అయింది, భోజనాలు సిద్ధం చేయండి అంటున్నారు ఎవరో. అందరి ముఖాల్లోనూ అలసట, అమ్మయ్య అయిపోయింది అన్న రిలీఫ్ కనిపిస్తున్నాయి నాకు. ఒక టీనేజ్ అమ్మాయి అందరి దగ్గరికీ వచ్చి తీర్థం ఇస్తోంది. **blond hair American** అమ్మాయి ఎవరు అని నేను ఆశ్చర్యపోతూవుంటే **Hai Uncle! How are you?"** అంది. ఉలిక్కిపడుతూ ఆ అమ్మాయి వైపు తేరిపార చూసి నేను ఇంకా బిత్తరపోయాను. ఆ అమ్మాయి అమెరికను కాదు, ఏమీ కాదు, మా స్నేహితుడు ప్రసాదరావు కూతురు. ఈ రోజుల్లో టీనేజ్ పిల్లలకి వేపకాయంత వెర్రి వుందని ఋజువు చేసింది అని నేను అనుకుంటూవుంటే అందరికీ చేతులు తుడుచుకోడానికి **paper napkins** ఇస్తూ ఆమె తమ్ముడు కనిపించాడు. వాడి జుట్టంతా ఎర్రగా వుంది. 'అయ్యయ్యో! ఇవేం రంగులు! ఈ అక్కాతమ్ముళ్ళకి ఏం పిచ్చి ఎక్కింది ఇలా విపరీత వేషాలు

వేస్తున్నారు' అనుకున్నాను మనసులో. ఇంతలో ప్రసాదరావు కనిపించాడు. "హల్లో ముకుందం! ఎలా వున్నావు" అన్నాడు నా దగ్గరికి వచ్చి పలకరిస్తూ. 'బాగానేవున్నాను" అన్నాను నవ్వుతూ. పిల్లలిద్దరూ దగ్గరికి వస్తే ఇంక తప్పదన్నట్టుగా "మావాళ్ళని చూసావా ముకుందం? అమెరికన్స్ కి వుండే తెల్లతోలు ఎటూ తెచ్చుకోలేము కాబట్టి కనీసం వారిలాంటి జుట్టన్నా వుంటే ఎలా వుంటుంది అని ప్రయత్నిద్దామనుకున్నారు కాబోలు" అన్నాడు వారిద్దరి పిల్లలను వుద్దేశించి ఇబ్బందిగా. "పోనీలే, ఒకసారి ఆ ముచ్చట కూడా తీరితే ఇంక వాళ్ళే సద్దుకుంటారు" అన్నాను నేను కొంచెం సద్దుతూ. అవును మరి. రేపు మా ప్రబుద్ధులేం చేస్తారో తెలీదు కదా!

"ముకుందంగారూ! ఎలా వున్నారు? నా పిచ్చి కానీ మీకేమండీ? రత్నాల్లాంటి ఇద్దరు కొడుకులు. ఒకడు కొలంబియాలో మెడిసన్. ఇంకోడు **Brown University** లో మెడిసన్. ఇంక కావల్సినదేముంది మీకు?" అన్నారు ఒకాయన దగ్గరకొస్తూ. నవ్వేసి వూరుకున్నాను. కానీ పిల్లలిద్దరూ మెడిసన్ లో చేరగానే సరిపోలేదు. ఏ అడ్డంకులు లేకుండా అది సజావుగా పూర్తి చేసి ఆ తర్వాత **Residency** లు అవీ అన్నీ పూర్తి చేసి జీవితంలో బాగా సెటిల్ అయితే ఇంక అప్పుడు అమ్మయ్య అనుకోవచ్చు. ఈ రోజుల్లో పిల్లలెలా వున్నారంటే ఇంతవరకూ బాగానే వున్నారు కాబట్టి ఇకముందు కూడా ఇలాగే బాగానే వుంటారు అనుకోవటానికి లేదు. జారి పడటానికి ఏ నిముషమైనా చాలు. అడుగడుగునా వారిని బలహీనపరిచి పెడదారులు పట్టించే శక్తులు బయట ఎన్నో. అందులో ఈ అమెరికాలో మరీను. ఇండియాలోలేని కొన్ని అదనపు సమస్యలు ఈ దేశంలో. ఇక్కడ కష్టపడి నిజాయితీగా తెలివితేటలు, పరిశ్రమ వలన పైకి రావటానికి ఎన్ని అవకాశాలు వున్నాయో, పక్క దారులు తొక్కి మన చేయి దాటిపోయి చెడు నడవడికలు నేర్చుకోవటానికి అంతకంటే ఎక్కువే దారులు వున్నాయి. "మనదేముందండీ! అంతా ఆ పైవాడి దయ" అన్నాను నేను మనస్ఫూర్తిగా. ఇలాంటప్పుడే ప్రతీవారికీ దేవుడంటే నమ్మకం పెరుగుతుంది. మన వశంలో లేని విషయాలు చూడటానికే కదా దేవుడు వున్నది! ఇంతలో అందరికీ ప్రసాదం ఇస్తూ ఒకమ్మాయి వచ్చింది మా దగ్గరికి. పట్టు పరికిణీ, పట్టు ఓణీ, బిగించి వేసిన జడ, జడకుప్పెలు, వంటి నిండా నగలు ఈ అమ్మాయిని మాత్రం నేను ఎంతమందిలోనైనా సరే, అతితేలికగా గుర్తు పట్టేస్తాను. ఇంత **traditional** గా తయారయ్యే అమ్మాయి ఇంకెవరుంటారు? రామబంటుగారి అమ్మాయి సీతాలక్ష్మి కాకపోతే!

"నమస్తే అంకుల్! బాగున్నారా" అంది సీతాలక్ష్మి ప్రసాదం ఇస్తూ. "బాగున్నానమ్మా. నువ్వెలా వున్నావు" అన్నాను నేను. సీతాలక్ష్మి ఈమధ్యనే మావూళ్ళో యూనివర్సిటీలో **Philosophy** లో మాస్టర్స్ ప్రోగ్రాం లో చేరింది. రామబంటుగారికి వున్న ఒక్కగానొక్క కూతురు తెలివైనది, బుద్ధిమంతురాలు, గుణవంతురాలు, అన్నింటినీ మించి వాళ్ళ తల్లితండ్రులు కోరుకున్నట్టుగా చాలా సాంప్రదాయకంగా పెరుగుతోంది. నిజంగా రామబంటుగారు నమ్మి పూజించే ఆ శ్రీరామచంద్రుడే ఆయన కుటుంబాన్ని సీతాలక్ష్మి ద్వారా దీవించాడు అని అనుకున్నాను నేను మనస్ఫూర్తిగా. రామబంటుగారి దంపతులు ఆ అమ్మాయిని చాలా కట్టుదిట్టాలలో పెంచారని అందరూ అనుకుంటారు. పూజ కొద్దీ పురుషుడు, దానం కొద్దీ బిడ్డలు అంటారు కదూ! రామబంటుగారి దంపతులు మంచి దానాలు ఇచ్చివుంటారు. అలా అనుకుంటే నేను, మంగళ కూడా మంచి దానాలే ఇచ్చి వుంటాము. మా ఇద్దరబ్బాయిలతోనూ ఇంతవరకూ మాకు కూడా ఏవీ పెద్ద సమస్యలు రాలేదు. ఏదో కొంచెం మా చిన్నవాడి గురించి తుంటరి అని నేను వర్రీ అవుతాను కానీ ఏమాటకామాట చెప్పుకోవాలి, వాడు కూడా ఇంతవరకూ, ఫరవాలేదు, ఎప్పుడూ మాకు తలవంపులు తెచ్చే పని ఏదీ చేయలేదు.

ఆలోచనలలో మునిగిన నేను భోజనాలు రెడీ అయ్యాయి, వచ్చి లంచ్ చేయండి అన్న పిలుపుతో మళ్ళీ ఈ లోకం లోకి వచ్చి పడ్డాను. భోజనాల దగ్గర దయామయిగారు కనిపించారు. "నమస్కారం దయామయిగారూ!" అంటూ పలకరించాను. "ముకుందంగారూ! నేనే మీకు ఫోను చేద్దామనుకుంటున్నాను. ఇంకో రెండు రోజుల్లో నేను ఇండియా వెళ్ళిపోతున్నాను" అన్నారు ఆవిడ దగ్గరకొస్తూ. "అవునా? అప్పుడే నాలుగు నెలలయిపోయాయా?" అన్నాను వెంటనే. "కాదనుకోండి. కానీ వచ్చిన పని ఇంక అవదని తెలిసిపోయింది కదా! ఇంక ఇక్కడేం చేస్తాను? తిరిగి వెళ్ళిపోతే కనీసం అక్కడ పనులన్నా అవుతాయి కదా" అన్నారు ఆవిడ. ఆవిడ గొంతులో వినిపించిన ఆశాభంగాన్ని, నిరాశని నేను గమనించకపోలేదు. సుమారు ఒక నెల రోజుల క్రితం దయామయిగారు వాళ్ళమ్మాయి పెళ్ళికోసం ఇండియా నుండి ఇక్కడికి వచ్చారు. వాళ్ళమ్మాయి మా వూళ్ళో **Dentist** గా పని చేస్తోంది. న్యూయార్క్ లో ఒక ప్రొఫెసర్ తో పరిచయం అయి అది పెళ్ళి దాకా వెళ్ళింది. ఇద్దరూ పెళ్ళికి సిద్ధం అనుకున్న తర్వాత పెద్దవారికి చెప్పారు. అబ్బాయి కుటుంబం ఇక్కడే న్యూయార్క్ లో వుంటారు. వాళ్ళే ఫోనులో దయామయిగారిని **contact** చేసారు. పెళ్ళి ఇక్కడే చేయాలంటే ముహూర్తాలు పెట్టించి, శుభలేఖలు వేయించి, పెళ్ళికి కావల్సిన సరంజామా అంతా తీసుకుని, పాపం, దయామయిగారు ఆదరాబాదరగా వచ్చింది ఈ దేశానికి. తీరా వచ్చిన తర్వాత పెళ్ళి విషయంలో మళ్ళీ **second thoughts** వున్నాయని వాళ్ళమ్మాయి అంటే ఆవిడకి అసలు మతి పోయినంత పని అయింది. అబ్బాయికి, అమ్మాయికి వాళ్ళ **relocation** విషయంలో ఒప్పందం కుదరలేదని, వున్న వూరు వదిలి ఇంకొకరి వూరుకి మారటానికి ఇద్దరూ సుముఖంగా లేకపోవటం వలనే కుదిరిన పెళ్ళి కూడా ఇలా ఆఖరి నిముషంలో ఆగిపోయిందని అందరికీ తెలిసిపోయింది. మరి ఈ విషయాలన్నీ ముందే మాట్లాడుకోలేదా? చాలా రోజులే **courtship** చేసారు కదా! ఇంత ముఖ్యమైన విషయాన్ని ఎలా మర్చిపోయారు? ముహూర్తాలు పెట్టుకుని, శుభలేఖలు కూడా

అందరికీ పంచిన తర్వాత ఇలా అయితే ఆ పెద్దవాళ్ళకి ఎంత బాధగా వుంటుంది? నలుగురిలో వాళ్ళ పరువులేమవుతాయి? ఇవన్నీ ఆ ఇద్దరూ ఆలోచించలేదా? అయినా నా పిచ్చి కానీ ఈ రోజుల్లో పిల్లలకి వారి గురించి ఆలోచించటానికే వారికి వున్న సమయం చాలటం లేదు, ఇంక తల్లితండ్రుల గురించి ఆలోచించటానికి టైమెక్కడ వుంది? భర్త లేకపోయినా వున్నంతలో దేనికీ లోటు లేకుండా కూతురిని అల్లారు ముద్దుగా పెంచి, ఇంత చేసి, ఇక్కడకు పంపించిన ఆ తల్లి హృదయం పిల్లల ఈ అవకతవకల పనులకు, పాపం, ఎలా ముక్కలయిందో ఆ పిల్లకేమన్నా అర్థం అవుతోందా? ఎవరిది తప్పు దీంట్లో? ఏది ఏమైనా, పాపం, దయామయిగారిని చూస్తుంటే నాకు చాలా బాధ కలిగింది. ఈ రోజుల్లో పిల్లలు, బాబోయ్! నమ్మటానికి లేదు. వాళ్ళేం చేస్తున్నారో వాళ్ళకే తెలియదు. ఇంక మనకెలా తెలుస్తుంది? అనుకున్నాను మనసులో.

భోజనాలు అయ్యాయి. అందరూ పిచ్చాపాటీ మొదలెట్టారు. ఎవరో అంటున్నారు "ముకుందంగారి పని హాయి. చక్కగా ఇద్దరూ మగ పిల్లలే! ఆడపిల్లల పెళ్ళి సమస్యలేవీ లేవు" అని. నేను చటుక్కున అటువైపు తల తిప్పి చూసాను. 'అలా ఎందుకనుకుంటున్నారు? ఆడ అయినా, మగ అయినా పెళ్ళి విషయానికొస్తే అది అందరికీ సమస్యే! మా అబ్బాయిలు పెళ్ళి చేసుకోమని అన్నా, మన ఇండియను పిల్లను కాదని వేరే ఎవరినన్నా చేసుకుంటామని అన్నా అది సమస్య కాదేమిటి?" అన్నాను చురుగ్గా. "అహ. అది కాదు ముకుందంగారూ! ఎంతైనా ఆడపిల్ల అంటే పేరు కదా! ఇంకొంచెం ఎక్కువ బాధ్యత. ఇంకొన్ని ఎక్కువ సమస్యలు........"అంటూ వారేదో ఇంకా అనబోతూంటే మధ్యలోనే ఆపేసాను నేను. "మీరు అక్కడే పొరపడుతున్నారు. నడవడిక విషయానికి ఆడ, మగ అందరూ ఒకటే! అబ్బాయిలైతే మాత్రం ఏ చెడు అలవాట్లు నేర్చుకుంటారో, ఏ ఆడపిల్లతో ఎప్పుడు ఏ బంధంలో ఇరుక్కుంటారో అని భయపడమా ఏమిటి?" అన్నాను వెంటనే. ఆడ, మగ అంటూ తేడాలు చూపిస్తూ అబ్బాయిలైతే ఫరవాలేదు, వదిలేయచ్చు, అమ్మాయిలైతేనే భయపడాలి, ఎక్కువ కట్టడి చేయాలి అన్న దృక్పథం నాకు నచ్చదు. అసలు ఆ మాటకొస్తే మా రెండోవాడు ఆడపిల్ల అయితే నేను ఎక్కువ సంతోషించేవాడిని. ఎందుకంటే వీడేమో దుడుకువాడు. ప్రతీదానికీ తొందర. ఆలోచన కొంచెం కూడా లేదు. ఆ వయసుకు వుండాల్సిన పరిపక్వత అసలే లేదు. హైస్కూల్ అవగానే **Brown University** లో మెడిసన్ **6 year program** లో **admission** వస్తే అందరూ అదృష్టం అన్నారు. టైము కలిసొస్తుంది, తప్పకుండా పంపండి అన్నారు. మంచి యూనివర్సిటీ, పిల్లవాడు పైకొస్తాడు అన్నారు. నిజమే! వారన్నవన్నీ యదార్థాలే! కానీ వారెవ్వరూ ఆలోచించనిది ఒకే ఒక్క విషయముంది. అసలే తుంటరి, బాధ్యత తెలీదు, ఇంత చిన్న వయసులో ఒంటరిగా అంత దూరాన ఎవరి **supervision** లేకుండా ఏ చెడు అలవాట్లో నేర్చుకుంటే అప్పుడేం చేయాలి? వున్న వూళ్ళో కూడా మంచి చదువులే వున్నాయి. అవి పనికి రావా? అయినా చదువు విషయంలో ఒకటి రెండేళ్ళు ఆలస్యం అయినా ఫరవాలేదు. కానీ అసలు మనిషే మనకు అందకుండా పోతే ఎలాగ? అందుకే వాడిని పంపడానికి నేను తెగ ఆలోచిస్తే అందరూ నన్నొక పిచ్చివాడిలాగా చూసారు. కష్టపడి చదివి మంచిచోట మెడిసన్ లో **admission** తెచ్చుకుంటే ఇంకా ఆలోచిస్తారేమిటి అని నా సంకోచాలెందుకో అర్థం కాక ఆశ్చర్యపోయారు. వాడు కూడా ఇది ఒక **prestige issue** లాగా తీసుకుని తోటి స్నేహితులందరి ముందు బాధపడ్డాడు. మంచిచోటకి పంపడానికి కూడా మీకు ఇన్ని సందేహాలా అంటూ తెగ వాదించాడు. ఈ **pressures** కి తట్టుకోలేక వాడిని పంపినా నేను, మంగళ వాడిని గురించి మథన పడని క్షణం లేదు. భయపడని నిముషం లేదు. ఎందుకంటే తెలివి లేని పిల్లల గురించి అంత బెంగ పడక్కరలేదు. వాళ్ళు ఎప్పుడు ఏం చేస్తారో మనం తేలికగానే ఊహించగలం. కానీ తెలివైన పిల్లల గురించే మనం చాలా జాగ్రత్తగా వుండాలి. ఏ నిముషం వారి తెలివి ఎటు పారిపోతుందో తెలియదు. సరైన దారిలో మళ్ళకపోతే ప్రమాదం తప్పదు. సరే, ఒకటి, రెండేళ్ళు గడిస్తే కానీ ఈ దినదిన గండం మాకు కూడా అలవాటవదు. వాడి మీద నమ్మకం కూడా పెరగదు. ఇదే ఆడపిల్ల అయితే బహుశా ఈ బాధ ఇంతగా వుండదేమో! ఎందుకంటే సాధారణంగా ఆడపిల్లలకి మగపిల్లల కంటే మానసిక పరిపక్వత త్వరగా వస్తుంది. ఇవన్నీ ఎంతమందికని వివరంగా చెప్పగలను నేను?

ఇంతలో ఎవరో రకరకాల స్వీట్స్ అన్నీ తీసుకొచ్చి పెట్టారు అక్కడ. చాలా బావున్నాయి అంటున్నారు. నా కళ్ళు మంగళ కోసం వెదుకుతున్నాయి. త్వరగా ఇంటికి వెళ్ళాలని వుంది. ఇంతలో రామబంటుగారి భార్య వచ్చింది అక్కడికి. "అందరూ సరిగ్గా భోజనం చేసారా? ఈ లడ్డులన్నీ ఇలాగే వున్నాయేమిటి? ముకుందంగారూ! మీ చేతిలో ఒక్క స్వీటన్నా లేదేమిటి? అప్పుడే అన్నీ తినటం అయిపోయిందా?" అంది గబగబా. నేనేదో అనేలోపే నన్ను కాపాడటానికన్నట్లు అక్కడికి మంగళ వచ్చింది. అందరికీ వీడ్కోలు చెప్పి కారెక్కబోతూంటే రామనాథంగారు పిలిచారు మంగళని. "అమ్మా! మంగళా! ఏమంటోందమ్మా మీ స్నేహితురాలు? మళ్ళీ కనీసం ఫోనన్నా చేయలేదు?" అన్నారు. వారి మనవడికి మంగళ తన స్నేహితురాలి కూతురిని పెళ్ళిసంబంధం చెప్పింది. "చేసిందట బాబాయిగారూ! పిన్నిగారితో మాట్లాడిందట. వారమ్మాయి ఇమెయిలు, ఫోను నెంబరు తీసుకుని మీ మనవడు ఫోను చేస్తాడని అన్నారట. కానీ ఇంతవరకూ ఫోను చేయలేదట. ఇమెయిల్ కూడా ఏమీ చేయలేదట. వాళ్ళందరూ ఎదురు చూస్తున్నారు మీ మనవడి ఫోను, ఇమెయిల్ కోసం" అంది మంగళ. రామనాథంగారికి ఒక్క క్షణం ఏమనాలో తోచలేదు. "అలాగా! నేనింకా వాళ్ళ ఫోను కోసం ఎదురుచూస్తున్నాను. కనుక్కుంటాను మా మనవడిని విషయం ఏమిటో" అన్నారు మెల్లిగా. చిన్నబోయిన ఆయన ముఖాన్ని చూస్తుంటే నాకు చాలా జాలి కలిగింది. "ఈ రోజుల్లో చాలామంది అబ్బాయిలు ఇలాగే చేస్తున్నారు.

కొంచెం కూడా మర్యాద లేదు. పెద్దవాళ్ళకేమో వీళ్ళ పెళ్ళి గురించి తొందరగా వుంటుంది. వీళ్ళేమో ఏసంగతి ఎంతకీ ఒకపట్టాన తేల్చరు. అసలు ఏ విషయమూ సరిగ్గా చెప్పరు. అమ్మాయిల విషయంలో **follow up** చేయరు. చొరవగా ముందు ఫోను కానీ, ఇమెయిల్ కానీ చెయ్యాల్సింది అబ్బాయిలు కానీ అమ్మాయిలు కాదు కదా!" అన్నాను నేను. మంగళ అవునన్నట్లు తల వూపింది. "సునందగారి అమ్మాయి మీరేమీ నాకు సంబంధాలు చూడద్దు, నేనే చూసుకుంటాను అంటే అందరికీ అది విడ్డూరంగా తోచింది అప్పుడు. కానీ ఆ అమ్మాయి తర్వాత ఒక అమెరికన్ ని చేసుకుంది. ఇలా ఎటూ తేల్చకుండా, విషయాన్ని నాన్చుతూ, పెద్దవాళ్ళ మాటకి కూడా విలువ ఇవ్వకుండా వారి పరువును తీసేసేకంటే తమ మనసులో మాట నిర్భయంగా, దాపరికం లేకుండా బయట పెట్టి అన్న మాట ప్రకారం నడుచుకోవటం మెరుగు కదూ!" అంది మంగళ. ఈ వివరాలన్నీ వింటూ రేపొద్దున్న మా సుపుత్రులిద్దరూ ఏం చేస్తారో అని ఆలోచిస్తున్నాను నేను.

ఇంటికి రాగానే బట్టలు మార్చుకుని కాస్సేపు నడుం వాల్చాను. ఈ లంచ్ పార్టీలకి ఇలాగే టైమంతా గడిచిపోతుంది. ఏమీ చెయ్యకుండానే అలిసిపోతాము. కళ్ళు మూతలు పడుతోంటే మళ్ళీ నిద్ర పట్టేసింది. కళ్ళు తెరిచేసరికి మంగళ " లేచారా? ఇవాళ అంత నిద్ర పోతున్నారేమిటండీ? పొద్దున చాలాసేపే నిద్ర పోయారుగా!" అంటోంది. "పెద్దవాడు ఫోను చేసాడు. ఈసారి సెలవులలో స్నేహితులతో పాటు పారిస్ కి వెళ్దామనుకుంటున్నాడుట" అంది. వింటున్న నేను కొంచెం వులిక్కిపడ్డాను. పైలాపచ్చీసు వయసు. బాధ్యతలేవీ ఆకలింపు కాని వుడుకు రక్తం. వెనక, ముందు చూడని వురకలేసే యవ్వనం. ఆడ, మగ కలిసి ఆ **romantic places** కి కులాసా ప్రయాణాలు చెయ్యటం నాకిష్టం లేదు. ఎవరికైనా ఎవరిపైనన్నా ఎటువంటి **feelings** ఏర్పడకుండా వుండాలే కానీ ఇకసారి అటువంటిదేదైనా జరిగితే మాత్రం ఇంక మనమేమీ చెయ్యలేం. వద్దు అంటే ఈ పిల్లలు వినరు. మన మర్యాదని నిలుపుకుని మౌనంగా ఆ నాలుగక్షింతలు వేయక తప్పదు. దురదృష్టవశాత్తూ వారిది తప్పు నిర్ణయమే అయితే ఇంక వారితో పాటు వారిని కన్నవారిగా మనకి కూడా జీవితాంతం బాధ తప్పదు. పెద్దవాడు చదువు విషయంలో బాగా చదువుకుని మంచి యూనివర్సిటీకి వెళ్ళి చిన్నవాడికి మంచి మార్గదర్శకత్వమే వహించాడు. పెళ్ళి విషయంలో కూడా అలాగే మంచి అమ్మాయిని, ఏదో కన్నవాళ్ళుగా మాకు నచ్చిన అమ్మాయిని చేసుకుంటే బాగుంటుంది. లేకపోతే చిన్నవాడికి కూడా ఒక **bad example set** చేసినట్లవుతుంది. అదీగాక అన్నయ్య విషయంలో ఒప్పుకున్నారు కాబట్టి నా విషయంలో కూడా ఒప్పుకోక ఏం చేస్తారు అన్న దిలాసా వాడి మనసులో ఏర్పడుతుంది. అయినా నా పిచ్చి కానీ ఇప్పుడు ఈ విషయాలన్నీ నేనెందుకు ఆలోచిస్తున్నాను? ఇవన్నీ చాలా అనవసరపు ఆలోచనలు కదూ! ఏమాత్రం తెలియని భవిష్యత్తు గురించి ఇప్పటి నుండే అధికమైన వూహలు, భయాలు ఎందుకు? అయినా ఏమో బాబూ! ఈ దేశంలో పిల్లలని పెంచటం కత్తి మీద సామువంటిది సుమా! ఏ వయసుకి తగ్గ సమస్యలు ఆ వయసుకి వుండటంతో పాటు కొన్ని అధికమైన సమస్యలు కూడా వున్నాయి ఇక్కడ.

ఇలా నేను మళ్ళీ ఆలోచనలలో మునిగిపోయాను. మంగళ మంచి చీర కట్టుకుని చక్కగా అలంకరించుకుంటోంది. "ఏమిటోయ్ ఇంత ప్రత్యేకంగా ముస్తాబవుతున్నావు. ఎవరికోసం?" అంటూ జోక్ చేసాను. మంగళ చురుగ్గా చూసింది నావైపు. "పిల్లలకి పెళ్ళిళ్ళు చేసే వయసొచ్చింది. ఇంకా ఇలాంటి వేళాకోళాలు మానలేదు మీరు. ధన్వంతరిగారింట్లో పార్టీ వుంది. మర్చిపోయారా?" అంది తెచ్చిపెట్టుకున్న కోపంతో. "అబ్బా! మళ్ళీ పార్టీనా? నావల్ల కాదు బాబూ! పొద్దున్నేగా రామబంటుగారింటికి వెళ్ళి వచ్చాం. ఇప్పుడు మళ్ళీ పార్టీ అంటే నాకు ఓపిక లేదు. కావాలంటే నువ్వు వెళ్ళు" అన్నాను నేను. ఏదో నెలకొకసారి, పోనీ నెలకి రెండు సార్లు అంటే ఫరవాలేదు కానీ ఇలా ప్రతీవారమూ పార్టీ అంటే ఎలాగ? పైగా ఒక్కోసారి ఇలా రోజుకి రెండు, మూడు అంటే ఎలాగ? ఇంక ఇంట్లో పనులకి టైమెక్కడ వుంటుంది? అసలీ దేశంలో మన ఆడవాళ్ళకి ఈ పార్టీల పిచ్చి ఏమిటో? ఎప్పుడూ కలిసే జనమే! ఎప్పుడూ వుండే విశేషాలే! పైగా పార్టీలంటే వంటలు, ఆ తర్వాత **cleaning** అంటూ ప్రయాస కూడాను. అయినా వాళ్ళకి విసుగ్గా వుండదు కాబోలు. "అయితే మీరు రారన్నమాట. సరే, పోనీ నేనొక్కద్దాన్నే వెళ్తానులెండి. ఇంట్లో వుంటారుగా! కనీసం పిల్లలతో కాస్త ఫోనులోనన్నా మాట్లాడండి" అంటూ మంగళ ధన్వంతరిగారింటికి పార్టీకి వెళ్ళిపోయింది.

భార్యామణిగారి శాసనం. తప్పుతుందా? పెద్దవాడికి ఫోను చేసాను. ఏదో అదీ ఇదీ మాట్లాడాడు తప్ప వాళ్ళ **Paris plans** ఏవీ నాతో ఏమీ చెప్పలేదు. నా అంతట నేను ఆ సంగతేదీ ఎత్తదల్చుకోలేదు. వాడు ఏం అడిగితే నేను ఏం చెప్పాలో కొంచెం రిహార్సల్స్ వేసుకుని సిద్ధంగా వుండాలి. ఏం చేస్తాం? పిల్లలతో అనుక్షణం పరీక్షలకి చదివి సిద్ధం అయినట్లు వాదోపవాదాలకి సిద్ధంగా వుండాల్సిన రోజులొచ్చాయి. వారేమంటే మనమేమనాలో, మనమేమంటే ఏం ముంచుకు వస్తుందో, వాళ్ళు మన ముందరి కాళ్ళకి బంధాలు ఎలా వెయ్యగలరో ఎంత బాగా వూహించగలిగితే అంత మంచిది. సరే, ఈ విషయాన్ని ముసుగులో గుద్దులాటలాగా వదిలేసాను. ఇలా ఎన్ని రోజులు దాటవేయగలనో తెలీదు. సరే, ఇంక చిన్నవాడికి ఫోను చేసాను. దొరకలేదు. దొరగారు, ఎక్కడ తిరుగుతున్నాడో, లేడు అనుకుంటూ కంప్యూటరు ముందు కూర్చున్నాను ఏవో పనులు చేసుకుందామని. ఆ పని అయిన తర్వాత చిన్నవాడికి మళ్ళీ ఫోను కలిపాను. ఒకటి, రెండు సార్లు ప్రయత్నించిన తర్వాత చివరికి దొరికాడు. కానీ అక్కడంతా గలభాగా వున్నట్లు చాలా గొంతులు కలగాపులగంగా వినిపిస్తున్నాయి. గట్టిగా ఏదో **western music** కూడా వినిపిస్తోంది. "ఏమిటి ఏదో హడావిడి వినిపిస్తోంది?" అన్నాను నేను ఫోనులో అనుమానంగా.

"స్నేహితులందరూ వచ్చారు. పార్టీ చేసుకుంటున్నాం **Dad**" అన్నాడు. "పార్టీనా? ఇంత రాత్రయింది. ఇంకా పార్టీ అయిపోలేదా?" అన్నాను. "అయిపోవటమా? ఇప్పుడే కదా పార్టీ మొదలయింది?" అన్నాడు. అర్ధరాత్రి దాటింది. పార్టీ ఇప్పుడే మొదలైందిట. ఏమనాలి వీళ్ళని? అసలేం చెప్పినా వినేట్లున్నారా? అయినా సరే పోనీ ఏమన్నా చెపుదామనుకున్నా, చుట్టూ స్నేహితులున్నారు. అది సమయమూ కాదు, సందర్భమంతకంటే కాదు. "సరే, రేపు మాట్లాడతాలే" అంటూ ఫోను పెట్టేసాను. పొద్దున్న చదివిన వారఫలాలు గుర్తొచ్చాయి. ఇంక అవన్నీ పట్టించుకోకూడదు అనుకున్నాను. ఇంతలో వచ్చింది మంగళ. నేను పడుకోవటానికి సిద్ధం అవుతున్నాను. పిల్లలిద్దరితోనూ మాట్లాడిన సంగతి చెప్పాను. "పార్టీనా? డ్రింక్స్ లాంటి వేమీ లేవు కదా?" అంది అనుమానంగా, ఆందోళనగా. "ఏమో! లేవనే ఆశిద్దాం. వున్నా ఏమీ చేయలేం. దూరాన వున్న వారిమీద మన ఆంక్షలు ఏమిటి?" అన్నాను సాధ్యమైనంత శాంతంగా. "రేపు నేను మాట్లాడతానులెండి. అప్పుడు చెప్తాను ఇలాంటివన్నీ మానేయమని" అంది. "మరీ ఎక్కువ కట్టడి కూడా చేయకూడదు. మొదటికే మోసం వచ్చే ప్రమాదం వుంది" అన్నాను నేను మళ్ళీ. ముందు గొయ్యి వెనక నుయ్యి అంటే ఇదేనేమో! అయినా మనం వద్దన్నా దూరాన వున్నవాళ్ళు ఏం చేస్తున్నారో ఎలా తెలుస్తుంది అనుకున్నాను.

"ఏమండీ! ఇవాళ పార్టీలో విలాస్ తన **girl friend** ని తీసుకొచ్చాడు" బట్టలు మార్చుకుని పక్క ఎక్కుతూ అంది మంగళ.

విలాస్ ధన్వంతరిగారి ఏకైక సంతానం. మావూళ్ళోనే **MBA** చదివి ఏదో కంపెనీలో మంచి వుద్యోగమే చేస్తున్నాడు. చాలా రూపసి. దానికి తోడు ఎదుటివాళ్ళని **impress** చేసే చక్కటి చలాకీతనం, మాటకారితనం, మంచి **manners** వున్నాయి. ఎవరినైనా సరే ఇట్టే బుట్టలో వేయగల నేర్పరి. అతని అందానికి, తెలివికి, మాటలకి మురిసిపోయి అమ్మాయిలందరూ అతని వెంట తెగ పడుతూ వుంటారని అందరూ అంటూవుంటారు. మా అబ్బాయిదేం తప్పు లేదు, అమ్మాయిలు వెంటపడి వదలనంటూంటే వాడు మాత్రం ఏం చేస్తాడు అంటూ ధన్వంతరిగారు, ఆయన భార్య అస్తమానూ విలాస్ ని వెనకేసుకొస్తూవుంటారు. అతను మాత్రం రోజుకో అమ్మాయిని మారుస్తూ వుంటాడు. వారిలో చాలామంది అమెరికను అమ్మాయిలే! ఇది అందరికీ తెలిసిన విషయమే!

'ఇందులో కొత్తేముంది? ఎప్పుడూ జరిగే విషయమే కదా!" అన్నాను నేను మామూలు విషయంలాగా.

"అబ్బ, అదికాదండీ. ఈసారి అమ్మాయి ఒక నల్లమ్మాయి" అంది మంగళ. "నల్లమ్మాయి కూడా ఆడపిల్లేగా! నల్లవాళ్ళు కూడా మనుషులేగా! వాళ్ళతో కూడా స్నేహం చేస్తాంగా! ఇంక తేడా ఏంవుంది?" అన్నాను నేను. మన ఇండియన్స్ నల్లవాళ్ళని మనకంటే తక్కువవారైనట్లు చిన్నచూపు చూస్తాం. అమెరికను అయినా ఫరవాలేదు, నల్లవాళ్ళు మాత్రం వద్దు అనుకుంటాం. "అదేమిటండీ అలా అంటారు? ఎంత అమెరికను అయితే మాత్రం, ఎంత ఒకటే అయితే మాత్రం నల్లవాళ్ళకీ, తెల్లవాళ్ళకీ తేడానే లేదా?" అంది మంగళ ఆశ్చర్యంగా. "తేడా వుందా లేదా అన్నది కాదు ప్రశ్న మంగళా! ఆ తేడా లేవన్నా వాళ్ళు చూసారా లేదా అన్నది ప్రశ్న. మరి వాళ్ళకి అవేమీ కనిపించటం లేదు. అవునా?" అన్నాను నేను.

పిల్లల వెనుక అనుక్షణం వుంటూ, వారేం చేస్తున్నారో వెయ్యి కళ్ళతో గమనిస్తూ, వీలు దొరికినప్పుడల్లా మనకి చేతనైన రీతిలో వారికి మన పద్ధతులు, నియమాలు, సంస్కృతి లాంటి వాటి గురించి చెప్తూ, ఇంక మనకంటూ ఒక జీవితమన్నది లేకుండా కేవలం వారి చుట్టూనే మన ప్రపంచాన్ని సృష్టించుకొని, ఇంత కష్టపడుతుంటేనే ఈ రోజుల్లో పిల్లలు మన మాట వినకుండా మన చేయి దాటిపోతున్నారు. ఇంక ధన్వంతరిగారిలాగా పిల్లలకి పూర్తి స్వేఛ్ఛని ఇచ్చి ఏమీ పట్టించుకోకుండా వారి బాగోగులు వారికే తెలుసు అని పూర్తిగా వదిలేస్తే ఇంక ఆ పిల్లలు తప్పు దారిన పట్టడానికి ఇంకా ఎక్కువ అవకాశం వుంటుంది కదూ! అయినా ఒకరిని గురించి మనం అంత తొందరగా ఏ తీర్పులూ చెప్పకూడదు. అది న్యాయం కాదు.

"పార్టీలో శ్రీలక్ష్మిగారు కనిపించారు. వారమ్మాయి 'లా' అయిపోతోందిట. మంచివాడిని చూసి నాకు పరిచయం చేయండి అన్నదట వారితో. ఏవన్నా సంబంధాలు తెలిస్తే చెప్పమన్నారు" అంది మంగళ మళ్ళీ. శ్రీలక్ష్మిగారి దంపతులు మరీ అంత కట్టుదిట్టాలలో ఏమీ పెంచలేదు వారి అమ్మాయిని. అయినా ఆ అమ్మాయి బాగానే చదువుకుంటోంది. బుద్ధిమంతురాలిగా పేరు కూడా తెచ్చుకుంది. మరి దీన్నేమనాలి? ఆ భగవంతుడి దయ అనాలా? లేక వారి అదృష్టం అనాలా? అంటే ఆ భగవంతుని దయ కానీ, అదృష్టం కానీ వుంటే మన ప్రయత్నం ఏమీ లేకపోయినా పనులన్నీ వాటంతట అవే చక్కగా జరిగిపోతాయా? ఇంక మానవ ప్రయత్న ప్రమేయమే లేదా? ఏమో బాబూ! ఏమనాలో తెలియటం లేదు.

మర్నాడు ఫ్లారిడాలో వున్న మా పిన్ని కూతురు ఫోను చేసింది. దానికి ఇద్దరు కూతుళ్ళు. పెద్ద పిల్లకి ఈ దేశంలో పుట్టి పెరిగినవాడు, అది స్వయంగా ఎన్నుకున్నవాడితో పెళ్ళి చేసారు. మంచి చదువు, వుద్యోగం, ఫేమిలీ అన్నీ వున్నవాడు, మన ఇండియను, ఒకటే కులం కూడా, తనంతట తను చూసుకున్నా మంచివాడిని చూసుకుంది, అన్నీ సరిపోయాయి అని అందరూ సంతోషించారు. కానీ పెళ్ళయిన రెండు నెలల నుండీ మొదలయింది వారి మధ్య కలహం. కారణాలు ఏమిటో కానీ ఎప్పుడు చూసినా పోట్లాడుకుంటూనే వుంటారు. ఈ బాధలన్నీ పడలేక రెండో అమ్మాయికి ఇండియాలో పుట్టి పెరిగిన అబ్బాయితో చేసారు. వారికీ మొదట్లో కలతలు తప్పలేదు. సరే, ఒకరికి ఒకరు **adjust** కావటానికి కొంత సమయం కావాలని వాళ్ళగురించి ఎవ్వరూ పెద్దగా

పట్టించుకోలేదు. కానీ ఈ పెద్దమ్మాయే అస్తమానూ దెబ్బలాటలతో, ఇదుగో, ఇప్పుడు విడాకుల దాకా పెళ్ళబోతున్నారట. ఫోనులో మా పిన్ని కూతురు, పాపం, గోల పెడుతోంది. ఏం చేస్తాం? ఎవరికి చెప్తాం? ఈ రోజుల్లో పిల్లలు అసలెవరన్నా ఏదన్నా చెప్తే వినేట్లున్నారా? మా జీవితం, మా ఇష్టం అంటారు. మనకి కంఠశోష మిగులుతుంది. అంతే!

కాలచక్రం ఎవ్వరికోసం ఆగదుగా! ఒక ఏడాది గడిచిపోయింది. మా పిల్లలిద్దరూ బాగానే చదువుకుంటున్నారు. పెద్దవాడికి మెడిసన్ అయిపోవస్తోంది. మన ఇండియను అమ్మాయిని, అందులోనూ పెద్దవాళ్ళు చూసిన పిల్లని పెళ్ళి చేసుకుంటే ఎన్ని లాభాలున్నాయో వీలున్నప్పుడల్లా చెప్పటం ఇంక మొదలెట్టాలి అని నిర్ణయించుకున్నాను. పోయిన ఏడాది స్నేహితులతో కలిసి వెళ్ళాలనుకున్న **Paris trip** వాళ్ళే **cancel** చేసుకున్నారు. మనం వద్దంటే బహుశా వినేవాళ్ళు కాదేమో! కారణం ఏదైనా అప్పుడు వద్దనుకున్నా ఇప్పుడు అలాంటి ప్లానులేవీ మళ్ళీ చేయరని ఏమీ నమ్మకం లెదు. మరి అప్పుడు నేనేం చేస్తానో నాకు తెలీదు. బహుశా ఇష్టం లేకపోయినా సరే అనే అంటానేమో! మరి అనక తప్పుతుందా? సరే, రెండోవాడు ఇదివరకటి కంటే కొంచెం ఫరవాలేదు. కానీ ఆ దూకుడు ఇంకా పూర్తిగా తగ్గలేదు. వాడి మీద వెయ్యి కళ్ళు, చెవులు ఎప్పుడూ వేసే వుంచాలి. ఏం చేస్తాం? శారీరకంగా ఎదిగినా కొంతమందికి మానసిక పరిపక్వత కొంచెం ఆలస్యంగా వస్తుంది కాబోలు. ఈలోపు మనం తొందర పడితే ఏం లాభం? అందుకే సహనంతో ఆ శుభదినం కోసం ఎదురుచూస్తున్నాను.

ఒకరోజు ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి మంగళ ఆతురతగా ఎదురుచూస్తోంది నా కోసం. "ఏమండీ! ఈ వార్తలు విన్నారా?" అంది సంభ్రమంగా నన్ను చూస్తూనే. "ఏవార్తలు?" అన్నాను నేను మెల్లిగా.

"సీతాలక్ష్మి పెళ్ళట. విలాస్ కి కూడా పెళ్ళి కుదిరిందట" అంది మంగళ. ఆమెకి ఇంకా కంగారు తగ్గలేదు.

"వయసొచ్చిన పిల్లలు. ఆ ఘటన తోసుకొచ్చింది. పెళ్ళిళ్ళు కుదిరాయి. ఇందులో అంత కంగారు పడవలిసింది ఏముంది?" అన్నాను నేను. ఈ రోజుల్లో ఎవర్ని చూసినా ఇంకా **courtship** లో వున్నారు, మాట్లాడుకుంటున్నారు, ఆలోచిస్తున్నారు, ఇంకా ఏదీ నిర్ణయించుకోలేదు లాంటి మాటలే తప్ప పెళ్ళికి సిద్ధం అయ్యారు, పెళ్ళి నిశ్చయమైంది అన్న మాటలు చాలా తక్కువగా వింటున్నాం. అందుకే ఎవరిదైనా సరే, పెళ్ళి కుదిరింది అంటే సంతోషంగా వుంది.

"అబ్బ, అదికాదండీ. ఇంతకీ ఎవరితోనని అడగరేం? సీతాలక్ష్మేమో తన **classmate** ఒక అమెరికను అబ్బాయిని చేసుకుంటోంది. విలాస్ ఏమో వాళ్ళ అమ్మ, నాన్న చూసిన అమ్మాయిని చేసుకుంటున్నాడు" ఇంక ఆగలేక అసలు విషయం చెప్పేసి వూపిరి తీసుకుంది మంగళ.

ఇప్పుడు వులిక్కిపడటం నావంతయింది. ఈరోజుల్లో పిల్లల గురించి

ఇంతవరకూ వున్న **girl friends** ఏమన్నా మోసం చేసారా? అతని పట్ల అంతా అనూహ్యమే అని నాకు బాగా తెలుసు. కానీ....మరీ....ఇలా....ఆకాశం భూమి మీద వాలిందంటేను, ఎడారిలో పూలు పూసాయంటేను ఎలా నమ్మటం? ఇంతకంటే విడ్డూరం ఇంకేమైనా వుంటుందా? ఒక్కసారి రామబంటుగారు, ఆయన మడి ఆచారాలు, పూజలు పునస్కారాలు, వాళ్ళావిడ తొమ్మిది గజాల చీర కచ్చ పోసి కట్టుకుని చేసే పూజలు, వంటలు, వార్పులు, ఒక్కగానొక్క కూతురు తమ గారాలపట్టి సీతాలక్ష్మి చేత మంచి మొగుడు కోసం వాళ్ళు చేయించిన అనేక కన్నె నోములు, దానాలు, ఆ అమ్మాయిని అమెరికాలో కూడా మన పద్ధతిలో పూర్తిగా సాంప్రదాయకంగా వాళ్ళు పెంచిన పెంపకం; ఇవన్నీ ఒక సినిమా రీలు లాగా కళ్ళముందు కదిలాయి నాకు. చిన్నప్పటి నుండీ నా కళ్ళముందు పెరిగిన పిల్ల. ఎప్పుడు చూసినా మన సాంప్రదాయకమైన దుస్తులు, నగలు అలంకరించుకుని, స్వఛ్ఛమైన తెలుగు మాట్లాడుతూ, కళకళలాడుతూ కలివిడిగా తిరిగే పిల్ల. తెలివైనది, చదువుకున్నది, గుణవంతురాలు. ఒక అమెరికనుని వలచి వరమాల వేయటానికి సిద్ధమై, తన కుటుంబ సభ్యుల వ్యతిరేకతను కూడా పట్టించుకోకుండా, తల్లితండ్రుల ఆశలను ధిక్కరించి ఇంత ధైర్యంగా ఆ ముద్దరాలు ఈ నిర్ణయం తీసుకుందంటే నమ్మలేకుండా వున్నాను. ఏమిటి దీనికి కారణం? ఏ శక్తి ఆమెను ఇలాంటి తిరుగుబాటుకి ప్రోద్బలం చేసింది? మన సాంప్రదాయాల పైన, లేక తన తల్లితండ్రుల ఆంక్షల పైన అంతర్గతంగా ఇంత విముఖత్వం పేరుకుపోయిందా? లేక ఇదంతా ఆ వయసు లోని జిలుగు, ఆకర్షణ చల్లిన మత్తా? లేక ఆ అబ్బాయి స్వభావం, గుణగణాలు నిజంగానే అంత అపురూపమైనవా? ఏది? ఏది దీనికి కారణం? ఇప్పుడు రామబంటుగారు దీనికి ఎలా **react** అవుతారు? నాపిచ్చి కానీ ఏ తల్లితండ్రులైనా ఎలా **react** అవుతారు? అందరూ ఒకేలాగా అవుతారు. ముందు వద్దంటారు. ఆ తర్వాత బాధ పడతారు. ఇంకా ఆ తర్వాత మొండి తేలి రాయిలాగా మారిపోతారు. సద్దుకుపోతారు. చివరికి కొన్ని రోజులకి మళ్ళీ అందరూ మామూలుగా అయిపోతారు. అంతే కదా! బహుశా ఈ విషయం పిల్లలకి కూడా తెలుసనుకుంటాను. అందుకే వాళ్ళు తమ కన్నవాళ్ళ ప్రేమలని ఒక **advantage** గా తీసుకొంటున్నారు.

అటు సీతాలక్ష్మి ఒక **extreme** కి వెళ్తే ఇటు విలాస్ ఇంకో **extreme** కి వెళ్ళాడు. రోజుకో **girl friend** ని మార్చేవాడు. వాళ్ళలో అసలు ఇండియను అమ్మాయిలు చాలా తక్కువ. అసలు ధన్వంతరిగారే విలాస్ తమ చేయి దాటిపోయాడని, ఏదో ఒక రోజు ఎవరో ఒక అమెరికను అమ్మాయిని గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసేసుకుంటాడని మనసుని సరిపెట్టేసుకుని దానికి సిద్ధంగా వున్నారు. మరి ఇప్పుడు అనుకోని విధంగా, ఎప్పుడూ ఆశించని రీతిలో అతను పెద్దవాళ్ళు ఎన్నిక చేసిన పిల్లను చేసుకోవటానికి సిద్ధపడటం అందరికీ ఒక **pleasant surprise.** మరి దీనికి కారణం ఏమై వుంటుంది?
ఎవరన్నా ఏమన్నా **unfaithful** గా వున్నారా? లేక మన సంస్కృతి, కుటుంబ

పద్ధతులు అన్నీ హఠాత్తుగా ఇప్పుడు గుర్తొచ్చాయా? లేక అమెరికను అమ్మాయిలు **girl friends** గానే తప్ప పెళ్ళాం పదవికి మాత్రం ఇండియను అమ్మాయిలే మెరుగు అనుకున్నాడా? కారణం ఏమై వుంటుంది? ఏది ఏమైనా అతను అందరికీ నచ్చే పని చేస్తున్నాడు.

ఈ అనుభవాల్లోంచి నేర్చుకోవటానికి మనకి ఏం పాఠం లభిస్తోంది? రామబంటుగారిలాగా మరీ చాదస్తంగా వుంటూ పిల్లలను అవసరానికి మించి కట్టడి చేస్తే వచ్చిన ఫలితమా ఇది? పోనీ అలా అని అసలు ఏమీ పట్టించుకోకుండా వదిలేస్తే మరి చెడిపోతారేమో! మరి ధన్వంతరిగారి విలాస్ విషయంలో అలా జరగలేదుగా! శ్రీలక్ష్మిగారి అమ్మాయి విషయంలో కూడా అలా జరగలేదు. ఇది కేవలం కాకతాళీయమేనా? లేక దీని వెనక మనందరి కళ్ళకి కనిపించనిది ఏదన్నా గూఢంగా దాక్కుని వుందా? ఇక్కడ పుట్టిన పిల్లలు సాధారణంగా ఇక్కడివారినే చేసుకోవటానికి ఇష్టపడతారు అని అంటారు. అలా అయితేనే అన్ని విషయాలలోనూ వారికి పొంతన వుంటుంది అంటారు. మరి అలా అయితే మా పిన్ని కూతురు తన పెద్ద కూతురితో అన్ని కష్టాలు ఎందుకు పడుతోంది? పెద్దవాళ్ళు నిర్ణయించింది కాదు. వాళ్ళే చూసుకుని, మాట్లాడుకుని, నిర్ణయించుకున్నారు. ప్రేమలు, దోమలు అన్నారు. అయినా కీచులాటలు, కలతలు తప్పలేదు. పోనీ అలా అని ఇందుకు విరుద్ధంగా పెళ్ళి చేసుకొన్న రెండో అమ్మాయి ఏమన్నా సుఖపడుతోందా? అదీ లేదు. అక్కడా సమస్యలు తప్పలేదు. అంటే దీనికి ఏమిటి అర్థం? ఏ దారిలో నడిచినా ముళ్ళు తప్పటంలేదు. మరి ఏం చేయాలి? ఏ పద్ధతి నవలంబించాలి? ఏ మార్గంలో పయనించాలి? అసలు ఈ రోజుల్లో పిల్లలు ఇంత స్వార్థపరులెలా అయ్యారు? ఎంతసేపు స్వసుఖమే కానీ తల్లితండ్రుల ఆరాటాలు వారి ఆలోచనలలోకి అసలు రావా? దయామయిగారి అమ్మాయి పెళ్ళికి సిద్ధమంటూ తల్లిని అంత దూరం నుండి ఎంతో వ్యయప్రయాసలకోర్చి ఇక్కడికి పిలిపించిన తర్వాత ఇంకా ఏవో సమస్యలు అపరిష్కారంగా మిగిలిపోయాయంటూ అంతా నిర్ణయమైన పెళ్ళిని చివరి నిముషంలో ఎందుకు అలా **cancel** చేసింది? అంత జటిలమైన సమస్యలు వుంటే వాటిని పరిష్కరించుకోకుండా పెళ్ళి లాంటి పెద్ద నిర్ణయం అసలు ఎందుకు తీసుకుంది? పోనీలే, పెళ్ళి అయిన తర్వాత ఇలా ఏమీ కాకుండా ఇప్పుడే కళ్ళు తెరిచింది అని సరిపెట్టుకుని సంతోషించాలా? రామనాథంగారి మనవడు పరాయివాళ్ళ ముందు తమ పెద్దవారి మాట పోతుందన్న ధ్యాస కూడా లేకుండా అలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? అదివరకే తన మనసులో ఎవరన్నా వున్నారా? పోనీ ఆ సంగతి చెప్పచ్చుగా! పెళ్ళికి తను ఇంకా రెడీగా లేడు అనుకుంటున్నాడా? పోనీ అదన్నా చెప్పచ్చుగా! ఏమాట తేల్చకుండా ఈ దాటవేయటం ఎందుకు? అందరినీ అలా సందిగ్ధంలో పెట్టడం వలన ఏం బావుకుంటున్నాడు? ఇంతమంది పిల్లల్ని చూస్తున్నాను. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క తీరులో వున్నారు. ఎందుకో తెలీదు. అనుక్షణం వెయ్యి కళ్ళతో గమనిస్తూ చాలా జాగ్రత్తగా పెంచాం, కాబట్టి తీరుగా వున్నారు అనటానికి లేదు. ఏ నియమాలు లేకుండా విచ్చలవిడిగా వదిలేసాం కాబట్టి చెడిపోయారు అనుకోవటానికి కూడా లేదు. ఇంతవరకూ మా మాట విన్నారు కాబట్టి జీవితంలో ఎంతో ముఖ్యమైన పెళ్ళి విషయంలో కూడా మామాట కాదనరు అనుకోవటానికి లేదు. చిన్నప్పటి నుండీ మన పద్ధతులలో పెంచాం కాబట్టి పెళ్ళి విషయంలో కూడా ఆ పరిధి దాటరు అనుకోవటానికి లేదు. అసలు దేనికీ గారంటీ లేదు. ఏదీ ఆశించటానికి లేదు. పిల్లల ముందు తల్లితండ్రుల జీవితాలు మీ దయ మా ప్రాప్తం లాగా అయిపోయాయి. ఏమో! రేపు మా పిల్లలేం చేస్తారో! ఇదంతా చూస్తుంటే ఒక్కటే అనిపిస్తోంది. పిల్లల విషయం లో మాత్రం ఇది మంచి ఇది చెడు అని కానీ, ఇది పని చేస్తుంది ఇది చేయదు అని కానీ ఖచ్చితంగా చెప్పటానికి ఇది అంటూ ఏదీ లేదు. ఒకరికి పని చేసింది వేరొకరికి పని చేయకపోవచ్చు. ఒకసారి పని చేసింది వారికే ఇంకోసారి పని చేయకపోవచ్చు. అంతా ఆ దేవుడి దయ, మన ప్రాప్తం. అంతే! అంతేనా? అంతేనేమో! మరి అలా అయితే పిల్లల విషయంలో మనం ఇంత తాపత్రయం ఎందుకు పడతాం? అహోరాత్రులూ వారి గురించే ఆలోచిస్తూ వాళ్ళ వున్నతి కోసం ఏ త్యాగాలైనా చెయ్యటానికి ఎందుకు సిద్ధమవుతాం? మనకున్న అర్హతలు, మనం పడ్డ కష్టనష్టాల ప్రమేయమేదీ లేక అంతా అదృష్టం మీదే ఆధారపడితే ఇంక సామాన్యులమైన మనలాంటి మామూలు మనుషులకి **motivation** ఏముంటుంది? మన పూర్వ జన్మ పాపపుణ్యాలు మన చేతిలో ఎటూ లేవు. ఇంక ఆ దైవకృప మీదే అంతా ఆధారపడితే ఇంక అందరూ తమ పిల్లల మీద వెచ్చించే సమయాన్ని పూజలు, భజనలకే కేటాయించవచ్చును కదా! పోనీ అలా చేసినా మన కోరిక తీరుతుందన్న నమ్మకం ఏమిటి? ఏమిటో, అంతా గజిబిజిగా, గందరగోళంగా, తికమకగా వుంది. ఇలా ఆలోచిస్తూ మంగళ వైపు చూసాను. సరిగ్గా అప్పుడే మంగళ కూడా నా వైపు చూసింది. అయోమయంగా, అగమ్యగోచరంగా వున్న ఆమె చూపుల్లో కూడా నాకు అదే తికమక కనిపించింది.